# అదిగో పులి, ఇదిగో తోక



అస్తమించే సూర్యబింబం ప్రకృతి కన్య నుదుట దిద్దిన ఎర్రని కుంకుమ బొట్టులా ఉంది. వీణ, రాణి బస్సు దిగి తమ ఇళ్ళవైపు దారితీశారు.

“సుధ ఈ రోజు కూడా మనతో కలిసి రాలేదు — చూశావా?” అంది రాణి.

ఏదో ఆలోచిస్తూ నడుస్తున్న వీణ, రాణి మాటలకు—“అవును” అంది ముభావంగా.

“సాయంకాలం స్పెషల్ క్లాసుకు కూడా రాలేదు. అసలు దాని వాలకమే నాకు కొత్తగా ఉంది. ఏమంటావు?” అంది రాణి.

ఎవరిని గురించయినా ముందు వెనకలు బాగా ఆలోచించనిదే ఒక వెడు

## ఆదోని లలిత

నిర్ణయానికి రాని వాణి, రాణి మాటలకు ఏం సమాధానం చెప్పాలో తోచక ఆలోచనలో పడిపోయింది.

"దానికి పార్వతీపురం మునసబుగారి అబ్బాయితో పెళ్ళి ఖాయమయిందట. ఆ మునసబుగారు మా నాన్నగారికి చాలా దగ్గరి స్నేహితులు. అసలు చెప్పడం మరిచాను — మా అన్నయ్య కూడా సుధ ఒక అబ్బాయితో కలిసి అమ్మ గుడి దగ్గర మాట్లాడుకోవటం చూశాడట. నేనొక రోజు చూశానంటే నీవు నమ్మలేదు. అన్న చెప్పిన పోలికప్రకారం, మేమిద్దరం చూసింది ఒకే అబ్బాయిని. సుధతో ఇంటికి కలిసి రానప్పుడంతా అది అక్కడికే వెళ్ళుతుం దనుకుంటాను. నాన్నతో మే మా విషయం చెప్పాము. నాన్న పార్వతీపురం వెళ్ళి మునసబుగారితో ఈ విషయం చెబుతా నన్నాడు. అయినా, మన దగ్గరి స్నేహితులకు అన్యాయం జరుగుతున్నప్పుడు మనకు తెలిసిన నిజాన్ని తెలిపి, వారి నాదుకోవటం మన బాధ్యత అన్నారు నాన్నగారు" అని తనకు తెలిసిన విషయాలను చెప్పింది రాణి.

ఏదో, తాము చూసిన దానికి గోరంతకు కొండంత అన్నట్టు వీళ్ళు అదే పనిగా పార్వతీపురం వెళ్ళి ఈ విషయం మునసబుగారితో చెప్పి, కుదిరిన సంబంధాన్ని చెడపటంలో వీళ్ళ కొరిగేదేమిటో వాణికి అర్థం కాలేదు. వాళ్ళ సంకుచిత స్వభావానికి వాణి మనస్సులోనే అసహ్యించుకుంది. అదిగాక, సుధా వాళ్ళూ ఏదో ఊరి నుండి బదిలీ అయి ఈ మధ్యనే అక్కడి కొచ్చారు. ఒకటే వీధిలో ఇళ్ళు కావటంవల్ల సుధతో స్కూలుకు రాను, పోను మూలంగా కొంచెం స్నేహం పెరిగింది. ఒకసారి ఇంటికి రమ్మని వాణి, రాణి సుధను పిలిచినప్పుడు సుధ చాలా బాధపడుతూ చెప్పింది — వాళ్ళ నాన్నగారికి తా నెక్కడికీ వెళ్ళటం ఇష్టం ఉండదని, ఆదేవిధంగా తన స్నేహితులు తమ ఇంటికి వచ్చినా ఇష్టపడరని. దానిని బట్టి సుధ తండ్రి చాలా కఠినమైన మనిషని అర్థంచేసుకున్నారు. ఏ ఊరి నుండి బదిలీ అయి వచ్చారని, ఇంకా మిగత కుటుంబ విషయాలు అడగటానికి ప్రయత్నించినప్పుడు సుధ చెప్పటానికి ఇష్టంలేకనేమో మాట మార్చేసింది. ఈ విషయాలన్నీ ఒక లిప్తపాటులో వాణి మనస్సులో మెదిలాయి. రాణి చెప్పిన దానికి తాను బదులు చెప్పేలోగా తాము ఇళ్ళను సమీపించటంతో ఎవరి ఇంటికి వారు దారితీశారు.

సాయంకాలం అంత ఆలస్యమైనా సుధ ఇంకా ఇల్లు చేరకపోయేసరికి, సుధ తల్లి రామలక్ష్మికి కాలు ఒక చోట నిలవటం లేదు. కాలుకాలిన పిల్లిలా వెలుపలికి, లోపలికి తిరగసాగింది. 'ఆయన వొచ్చే టైము కూడా అయింది. వస్తే మరే ఉపద్రవం ముంచుకొస్తుందో?' అని తనలో తను ఎన్నోసార్లు అనుకుంది. అంతలో సుధ రావటంతో ఆమె మనస్సు కుదుట పడింది.

"అమ్మాయీ, త్వరగా లోపలికెళ్ళి బట్టలు మార్చుకో. నాన్నగా రొచ్చే వేళ అయింది" అని ఆమె మరో మాటకు ఆస్కారం లేకుండా వంటింటి వైపు దారితీసింది. కనీసం ఎందు కంత ఆలస్యమైం దనయినా అడగలేదు. తన తల్లికి తనమీ దున్న నమ్మకానికి సుధ మనస్సు పులకరించింది సంతోషంతో. స్కూలు ఫైనలు చదువుతున్న తనకు అప్పుడే పెళ్ళి వద్దని, ఇంకా పైకి చదవాలని తను తల్లితో ఎంతో చెప్పింది, తండ్రితో చెప్పే ధైర్యం లేక. తండ్రి చండశాసనుడు. అతని మాటకు తిరుగులేదు. చెప్పే ధైర్యం లేక, చెప్పినా ప్రయోజనం ఉండదని తెలిసిన రామలక్ష్మి కూతుర్ని సముదాయించింది.

పెళ్ళి పార్వతీపురానికి నాలుగు మైళ్ళ దూరంలో ఉన్న వీరభద్రస్వామి ఆలయంలో జరపటానికి నిశ్చయమయింది. వీరభద్రస్వామి మునసబుగారి ఇలవేల్పు. రాత్రి పది గంటలకు ముహూర్తం కావటంవల్ల, ఇరువైపుల వారు పెళ్ళివాడు ఉదయానికంతా ఆలయం చేరే ఏర్పాట్లు జరిగాయి.

పెళ్ళిరోజున ఆలయ ప్రాంగణమంతా జనంతో నిండిపోయింది. తారల తళతళల మధ్య చంద్రమామ వెన్నెలను కురిపిస్తూ పెళ్ళి సంబరాన్ని చూస్తున్నాడు. వధూవరులు పీటల మీద కూర్చున్నారు. ముహూర్తం దగ్గర పడుతూంది. బంధువుల మధ్య హడావిడిగా తిరుగుతున్న మునసబు రాణి తండ్రి రామలింగాన్ని చూసి సంతోషంతో ఎదురెళ్ళి, "రండి, రండి" అని ఆహ్వానించాడు.

"మీతో ఒక విషయం అవసరంగా మాట్లాడాలి" అంటూ మునసబును





పందిరిలో ఒక మూలకు తీసుకెళ్ళి తను చెప్పదలచినది చెప్పాడు ఆయన. మునసబు తోక తొక్కిన త్రాచులా లేచాడు. తన కొడుక్కి తలపెట్టిన అన్యాయానికి పెళ్ళివారిపై కోప మొకవైపు, అంతలో ఉన్న విషయాన్ని తెలిపి తనను ఆదుకున్న స్నేహితునిపై కృతజ్ఞత ఒకవైపు, తెలిసిన విషయాన్ని తెలుపటానికి ఇత డింత ఆలసించినందుకు కోప మొకవైపు ముప్పిరిగొనగా, "మీ రింత ఆలస్యం చేశారేమిటండి? ముహూర్తం కూడా సమీపించింది" అన్నాడు మునసబు.

"నే నేం చేయను, చెప్పండి? పెళ్ళికూతురు వదనడక మంచిది కాదు. ఇది మేము స్వయంగా చూచిన విషయం అని చెప్పటానికనే పార్వతీపురం వచ్చాను. ఆ సమయంలో మీరు ఉండలేదు. ఇది ఇంట్లో మీరుకాక, మిగత వాళ్ళతో చెప్పదగిన విషయం కాదని చెప్పటం మాని, మరల వచ్చి కలుద్దా మనుకున్నాను, ఇంకా ముహూర్తం దూరంలో ఉందనుకుని. అంతలో నాకు అనవసరంగా పనిపడి ఊరెళ్ళవలసి వచ్చింది. తీరా వచ్చిన తరవాత ముందు అనుకున్న ముహూర్తం వద్దనుకుని దగ్గరలో ముహూర్తం పెట్టుకున్నారని, అది ఈ రోజే అని తెలిసి క్షణ మాలస్యం చేయక వచ్చాను" అని రామలింగం ఇంకా ఏదో చెప్పబోతున్నంతలో ఇక ఆలస్యం చేయడం మంచిది కాదని, అక్కడినుండి వడివడిగా పెళ్ళిపందిరి వైపు నడిచాడు మునసబు.

అమృతమయం కావలసిన సుధ జీవిత భాండంలో విషాన్ని చిలికించి, మెల్లగా జారుకున్నాడు రామలింగం.

ఉన్నట్టుండి పెళ్ళి పందిరిలో కలవరం బయలుదేరింది. మునసబు తను వైపు పెళ్ళివారిని చూసి బయలుదేరండంటున్నాడు. కుమారుని పెళ్ళిపీటల మీదనుంచి లేవమంటున్నాడు కోపంతో. విషయమేమిటో అర్థంకాని పెళ్ళికొడుకు తండ్రివైపు అయోమయంగా చూచాడు. ఇక నిగ్రహించుకోలేని మునసబు చివాలున కుమారుని పెళ్ళిపీటల నుండి ఇవతలకు లాగాడు. సుధ, సుధ తల్లిదండ్రులు, మిగత వారు ఏం జరిగిందో తెలియక కంగారుపడిపోయారు.

"మాకు ఇంత అన్యాయం చేయదలిచారా? మీది మాలా పరువుగల కుటుంబ మనుకున్నాను. ఇలా ఎవ్వరితోనో అక్రమ సంబంధం గల అమ్మాయిని ఏ మెరుగున్నట్లు మా కంట గడతా రనుకోలేదు" అంటూ మునసబు ఆవేశంతో ఊగిపోతున్నాడు.

సుధ ఈ ఆకస్మిక పరిణామానికి స్థాణువైపోయింది. అసలే కోపిష్టి అయిన సుధ తండ్రి, ఏ మెరుగని తన కూతురు నా విధంగా తూలనాడుతున్న మునసబు మాటలకు ఆవేశపడదగిన సందర్భం కాదని తనను తాను నిగ్రహించుకుని బతిమాలే ధోరణితో— "మీ రెవరో కానివాళ్ళు చెప్పిన మాట లను విని పొరపడుతున్నారు" అని సర్ది చెప్పబోయాడు. అయినా, మునసబు వినిపించుకొనే స్థితిలో లేడు.

"కానివాళ్ళు కాదు. మా కయిన వాళ్ళు కళ్ళారా చూచిన విషయం. అంతెందుకు? మీ కూతురునే అడగండి — తను అమ్మ గుడి దగ్గర తరుచు ఒక అబ్బాయిని కలుసుకోవటం అబద్ధమేమో? అయినా, ఇటువంటి అక్రమాలకు అటువంటి పవిత్ర స్థలమే కావలసివచ్చిందా?" అంటూ ఇంకా రెచ్చిపోయాడు మునసబు. మునసబు మాటలకు సుధ నిలువెల్లా కంపించిపోయింది. అదే సమయంలో మునసబు జబాబుతో సహా పలుకుతున్న మాటలకు ఆశ్చర్యపోయిన సుధ తండ్రి సుధవైపు చూశాడు. ఆనువణువునా కంపించిపోతున్న సుధ తండ్రి మొహం చూడగలిగే ధైర్యం లేక తల వంచుకొంది. ఆమె తల వంచుకోవటంతో, అది నిజమనిపించి అంతమందిలో ఇక జీవితంలో తల ఎత్తి తిరగలేకుండా చేసిన కూతురిపై కోపము, తనకు కలిగిన దుస్థితికి బాధ మిళితమై ఆయన అచేతనంగా నిలబడిపోయాడు. రామలక్ష్మి బాధ వర్ణనాతీతం. వీరు అలా చూస్తూ ఉండగానే ఎక్కడి వారు అక్కడ వెడలిపోయారు, తనకు తోచింది తాము చెప్పుకుంటూ. కళకళలాడుతున్న పెళ్ళి పందిరి నిర్జీవంగా తయారయింది. ఆ విషాద వాతావరణాన్నిక చూడలేనట్లు చందమామ మబ్బుల చాటున చేరాడు.

సుధ తన గదిలో కుళ్ళి కుళ్ళి ఏడుస్తూంది. ఇక బయటికి వెళ్ళే యోగం ఉండదని తనకు బాగా తెలుసు. గదికి తాళం వేసి, గది ముందు పచార్లు చేస్తున్నాడు సుధ తండ్రి, ఇక ఏం చేయాలో, నలుగురిలో తల ఎత్తి తిరగడ మెలాగో తెలియక. ఆతని మనస్సు అవమానాగ్నితో మండిపోతూంది. రామలక్ష్మి వంటింటి గుమ్మం ముందు కూర్చుని మూగగా రోదిస్తూంది, బయటి కొచ్చే ధైర్యం కూడా లేక. సుధ ఇక తాను బ్రతికి ప్రయోజనం లేదన్న నిర్ణయాని కొచ్చింది. కాని, ఆ గదిలో తనను తాను అంతమొందించుకునే మార్గం కూడా కనిపించలేదు. ఆలోచిస్తూ నలుమూలల పరికించిన సుధ కన్నులు ఒక మూలనున్న ఎండ్రిన్ డబ్బా పైన ఆగిపోయాయి. అది తన తండ్రి తమ పొలాలున్న గ్రామానికి పంపటానికి కొని పెట్టిన డబ్బా.

రెండు గంటల సమయం. సుధ గదిలో ఇంకా లైటు వెలుగుతూంది. గదికి దగ్గరలో, ఆలోచనలతో అలసిన సుధ తండ్రి ఈజీచెయిర్‌లో కూర్చున్నవాడు అలానే నిద్రపోయాడు. పచ్చి మంచినీళ్ళయినా తాగని కూతురుపట్ల సానుభూతితో రామలక్ష్మి మనస్సు కరిగిపోయింది. తనకు తెలుసు— తన కూతు రలాంటి పని ఎప్పుడూ చేయదు. కాని, జరిగిన విషయమేమిటో అడిగి తెలుసుకునే వ్యవధి తనకు, చెప్పే వ్యవధి కూతురుకు ఆత డివ్వలేదు. భర్త బాగా నిద్రపోతున్నాడన్న నమ్మకం కుదిరిన తరవాత ఆమె మొండిధైర్యంతో మెల్లిగా వెళ్ళి సుధ గది తాళం తీసింది. అక్కడ కనిపించిన దృశ్యానికి ఆమె కెవ్వున కేకవేసింది. సుధ తండ్రి ఆ కేకకు అదిరిపడి లేచాడు. ఆ దృశ్యాన్ని చూచిన ఆతని రాతి మనస్సు కరిగిపోయింది. గదిలో నిర్జీవంగా పడిన కూతురు, ఒక పక్క మూత తీసిన ఎండ్రిన్ డబ్బా, మరో పక్క పేపరు వెయిటు క్రింద జాగ్రత్తగా పెట్టబడిన ఉత్తరం. వణికే చేతులతో ఆతడు ఉత్తరాన్ని అందుకుని చదవసాగాడు, మసకబారిన కళ్ళతో కంటి నీటిని దిగమింగుతూ.

"నాన్నా, మునసబుగారు చెప్పిన మాటలు నిజమే. కాని, అది వారు ఊహించినట్లు ఆత నెవరో పరాయి వ్యక్తి కాదు. నన్ను ప్రాణానికి ప్రాణంగా ప్రేమించిన అన్నయ్య. ఆరు నెలల క్రితం మీ కఠిన శాసనానికై బలై, మీ కిష్టంలేని అమ్మాయిని ప్రేమించి పెళ్ళిచేసుకున్న నేరానికి మన నుండి దూరమయ్యాడు. అన్నయ్య చేసిన పనిని మీరు పెద్ద అవమానంగా తలపోసి, బదిలీ చేయించుకుని ఇక్కడికి వచ్చారు. అమ్మను, మమ్మల్ని మీరు విధించిన కఠిన శాసనాన్ని ఉల్లంఘించి వచ్చి చూచే ధైర్యం లేక, స్నేహితుల ద్వారా మన మిక్కడికి బదిలీ అయి వచ్చిన సంగతిని, మన వివరాలను తెలుసుకున్న అన్నయ్య నన్ను అప్పుడప్పుడు వచ్చి చూచేవాడు. అమ్మ ఆలయం దగ్గర కలిసి మాట్లాడే వాళ్ళం, మరొకచోటయితే బాగుండదని. ఈ విషయం తెలిస్తే మీరు నన్ను, అన్నయ్యను బ్రతకనివ్వరని భయపడి మీతో చెప్పలేదు. కాస్త నిదానంగా అమ్మతో చెబుదామనుకున్నాను. ఇది నిజం. మీకు నా మాట మీద నమ్మకం లేకపోతే, వచ్చే శుక్రవారం అన్నయ్య నన్ను చూడటానికని సాయంకాలం ఆలయాని కొస్తానన్నాడు. చెల్లిని పెళ్ళి కూతురుగా చూడలేని తన దురదృష్టాని కెంతో బాధపడిన అన్నయ్య, ఆ రోజు వస్తానన్నాడు, పెళ్ళయిన తరవాత మంగళసూత్రాల కాంతితో మెరిసిపోయే తన ముద్దుల చెల్లిని చూడటానికి. మీరు వెళ్ళి అన్నయ్యను చూచి, మీ అనుమానం తీరిన తరవాత 'ఇక నీ చెల్లిని ఈ జీవితంలో చూడలే' వని చెప్పండి. కనిపించే మనస్సు కరుణతో అర్థంచేసుకో గలిగాలి, నాన్నా!

మీకు, అమ్మకు, అన్నయ్యకు నా వందనములు.

మీ ప్రేమాదరాభిమానాలకు నోచుకోని మీ — సుధ." ★